ముగిసిన చేప ప్రసాదం పంపిణీ

30 గంటల్లో 70వేల మందికి చేప ప్రసాదం విక్రయాలు

ఏర్పాట్లలో ప్రభుత్వ వైఫల్యంపై సర్వత్రా విమర్శలు

సుల్తాన్ బజార్, జూన్ 9: ప్రతీ యేటా మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని కుటుంబం చేపట్టే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. మొత్తం 35 కౌంటర్ల ద్వారా బత్తిని కుటుంబ సభ్యులు, వలంటీర్లు చేప ప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. చేప ప్రసాదం ముగింపు సమయానికి 59, 231 కొర్రమీను చేప పిల్లలను విక్రయించినట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాస్, సుజాత తెలిపారు. దీంతో పాటు సుమారు 10వేల మందికి పైగా శాఖాహారులకు బత్తిని కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా బెల్లం మందును పంపిణీ చేసినట్లు బత్తిని హరినాథ్ కుమార్తె హరిత నంద తెలియజేశారు. మొత్తంగా 30 గంటల్లో 70 వేల మంది చేప ప్రసాదాన్ని స్వీకరించినట్లు సమాచారం. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం లభించని వారికి దూద్‌బౌలీ, కవాడిగూడ, వనస్థలిపురం తదితర ప్రాంతాలలోని బత్తిని వారి నివాసాల్లో రెండు రోజుల పాటు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయితే ఈ ఏడాది ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రజల కోసం సరైన ఏర్పాట్లు చేయలేదనే విమర్శలున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిచ్చింది. దీనికి తోడు ఆదివారం క్యూలైన్‌లో నిలబడిన ఓ వృద్ధుడు మృతిచెందడం కూడా ప్రభుత్వ ఏర్పాట్లను ఎత్తిచూపినట్లు అయ్యింది.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

మెహిదీపట్నం, జూన్ 9: గోల్కొండ మోతి దర్వాజ వద్ద ఉన్న పురావస్తు శాఖ స్థలాన్ని ప్రయివేట్ వ్యక్తులు, కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆ శాఖ సూపరింటెండెంట్ మల్లేశానికి సోమవారం సీపీఎం కార్వాన్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. విఠల్ మాట్లాడుతూ.. 25 సంవత్సరాల నుంచి పురావస్తు శాఖ స్థలాన్ని కాపాడుతూ వస్తున్నామని. ఇప్పుడు కొందరు ల్యాండ్ మాఫియా వాళ్లు ఆ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూమిని ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ స్థలాన్ని కాపాడకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బాబా, రషీద్, మోహిన్, ఎజాజ్, సర్వార్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులను విస్మరించిన ప్రభుత్వం

కాచిగూడ,జూన్ 9: మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం రాత్రి కాచిగూడ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మున్నూరు కాపు కార్పొరేషన్ ఇప్పటికీ అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న మున్నూరు కాపులను మంత్రివర్గంలో ఒక్కరికీ కూడా అవకాశం ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బీఆర్ జితేందర్, కొంతం సురేశ్‌బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత కార్డులు అందేనా..?

- దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం
- కార్డుల కోసం పేదల ఎదురుచూపులు
- కార్యాలయాలు, మీసేవల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నవైనం
- త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు వినతి

అబిడ్స్, జూన్ 9: నూతన ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. దీంతో అర్హులైన వారికి కార్డులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ కార్డుల కోసం వాకబు చేస్తున్నారు. జంట నగరాలలో పౌర సరఫరాల శాఖకు తొమ్మిది సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 1 వరకు 1,80,000 మంది దరఖాస్తులు..

ఆయా కార్యాలయాల నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు 1,80,000 మంది ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా గతంలో ఆహార భద్రత కార్డులు ఉన్న వారు తమ కార్డులో నూతనంగా సభ్యులను చేర్పించే ప్రక్రియ 2016 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉండటంతో సభ్యులను చేర్పించుకునేందుకు రెండు లక్షల 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. లక్షలలో ఉన్న ఈ దరఖాస్తులను పరిశీలించేందుకు పౌరసరఫరాల శాఖ కార్యాలయాలలో సిబ్బంది తక్కువగా ఉండటంతో సకాలంలో దరఖాస్తుల పరిశీలన జరగడం లేదు.ఇందు కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు అదనంగా జీహెచ్ఎంసీ సిబ్బంది కోసం కమిషనర్‌కు విన్నవించగా వారు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. నెల వరకు దరఖాస్తుల పరిశీలన కొంచెం వేగంగా జరిగినప్పటికీ ఈ మాసంలో మూడు నెలల సరుకుల సరఫరా జరుగుతుండడం వలన అధికారులు సిబ్బంది ఆ సరుకుల పంపిణీ సక్రమంగా జరిగే విషయంలో బిజీగా గడుపుతున్నారు. దీంతో ఈ నెల ఆహార భద్రత కార్డుల పరిశీలన మరింత ఆలస్యంగా జరుగుతోంది.

ఇప్పటి వరకు 45 వేల దరఖాస్తుల పరిశీలన..

జంట నగరాలకు చెందిన ప్రజలు ఆహార భద్రత కార్డుల కోసం 1,80,000 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు అందులో 45 వేల దరఖాస్తులను మాత్రమే అధికారులు పరిశీలించగలిగారు. అందులో దాదాపు పదివేల దరఖాస్తులు అనర్హులుగా నిర్ణయించి మిగిలిన 35,000 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించి వారికి కార్డులు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నారు.

పరిశీలించాల్సినవి 1,30,000 దరఖాస్తులు..

ఇంకా 1, 30,000 దరఖాస్తులను అధికారులు పరిశీలించాల్సి ఉంది. అదేవిధంగా ఇప్పటికే ఉన్న ఆహార భద్రత కార్డులలో నూతన సభ్యులను చేర్పించడం అంటే పుట్టిన పిల్లలు, నూతనంగా వివాహం చేసుకున్న సందర్భంగా ఆ ఇంటికి వచ్చిన కోడలు తదితర పేర్ల నమోదుకు గాను రెండు లక్షల 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,10,000 ఇప్పటికే పరిశీలించగా ఇంకా 1,16, దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. వీటన్నింటినీ త్వరగా పూర్తి చేయాలంటే వీరికి అదనంగా సిబ్బంది అవసరం అదనంగా సిబ్బంది కావాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ రమేష్ కలిసి విన్నవించగా అక్కడ కూడా పని ఒత్తిడి వలన సిబ్బందిని సమకూర్చలేకపోయారు. దీంతో నూతనకార్డుల జారీలో జాప్యంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి అన్ని దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డులను జారీచేయాలని పేదలు కోరుతున్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి



జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, జూన్ 9 : అంబర్‌పేట డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన నారాయణ గూడ కార్యాలయంలో జలమండలి జీఎం రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కృషితో అంబర్ పేట డివిజన్‌కు రూ.80 లక్షల వ్యయంతో జల మండలికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు మంజూరు అయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. దీంతో పాటు డివిజన్ లోని పలు ప్రాంతాల్లో స్థానికులను వేధిస్తోన్న మంచినీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం వీలైనంత త్వరగా అవసరమైన ప్రాంతాల్లో నూతన మంచినీటి, డ్రైనేజీ పైప్ లైన్ల పనులు త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. జల మండలి డీజీఎం విష్ణువర్ధన్ రెడ్డి, ఏఈ ప్రదీప్ కుమార్ తో పాటు బీఆర్ఎస్ నాయకులు మహేష్ ముదిరాజ్, రంగు ఉదయ్ కిరణ్‌గౌడ్, సంతోష్‌చారి, వినయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు

అంబర్‌పేటనుంచి తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు

అంబర్‌పేట/ గోల్నాక , జూన్ 9 : కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరైన సిద్ధిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావుకు మద్దతుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో రెండు వందల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లారు. పార్టీ డివిజన్ అధ్యక్షులు సీహెచ్ చంద్రమోహన్, ఎం. సిద్దార్థ్ ముదిరాజ్, మేడి ప్రసాద్, భీష్మాదేవ్‌ల నేతృత్వంలో ఆయా డివిజన్ల నుంచి సీనియర్ నాయకులు కె.లింగారావు, టి.రమేశ్, మిర్యాల రవీందర్, కె.నర్సింగ్‌రావు, విజయేంద్రసాగర్, రాజేశ్, బాబు, బ్రహ్మాజీ తదితరులు హరీశ్‌రావుకు మద్దతుగా తరలి వెళ్లారు.

ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద హరీశ్ రావుకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

యువతి అదృశ్యం

సుమయబేగం

కాచిగూడ, జూన్ 9: స్నేహితురాలి పుట్టినరోజుకని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హెచ్. నరేశ్ వివరాల ప్రకారం.. అడ్డి కార్ఖానాకు చెందిన సయ్యద్ ఖాదర్ కుమార్తె సుమయ్య బేగం (17)ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతుంది. ఆదివారం రాత్రి స్నేహితురాలి పుట్టిన రోజుకి వెళ్లి తిరిగి రాలేదు. కలత చెందిన తల్లి హన్సియా బేగం సోమవారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కాంగ్నిజెంట్‌లో ఉద్యోగం

సుల్తాన్ బజార్, జూన్ 9: ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్) మూడో సంవత్సరం ఫిజికల్ సైన్సెస్‌లో డిగ్రీ పూర్తిచేసిన ఇద్దరు విద్యార్థినులు బి. కాంచన, టి. యశస్విని హైదరాబాద్ లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ కాగ్నిజెంట్ నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొని ఎంపిక అయ్యారు. విద్యార్థులు కమ్యూనికేషన్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్, టెక్నికల్ మొదలైన మూడు దశలలో నిర్వహించబడిన ప్రక్రియలో ఉత్తీర్ణత సాధించి అర్హత సాధించారు. వీరికి కంపెనీ నుంచి ఆఫర్ లెటర్లు పంపించడం జరిగింది. దీంతో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ కాంగ్నిజెంట్ ఉద్యోగం సంపాదించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల టి.ఎస్.కె.సి. కోఆర్డినేటర్ శ్రీకాంత్, మెంటర్ చంద్రకళ, సంబంధిత విభాగాధిపతులు మరియు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ

నయనానందకరంగా కూచిపూడి నృత్యోత్సవం

కూచిపూడి నృత్యోత్సవంలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 9 : రవళి ఆర్ట్స్ అకాడమీ కూచిపూడి నృత్య శిక్షణ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవం ఆఫీసర్స్ కాలనీ మోనా గ్రౌండ్‌లో నయనానందకరంగా జరిగింది. రవళి ఆర్ట్స్ అకాడమీ వ్యస్థాపక కార్యదర్శి, నృత్య గురువు రవళి రమేశ్‌బాబు నృత్య దర్శకత్వంలో ఆయన శిష్య బృందం చక్కని హావభావాలు ప్రదర్శిస్తూ చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా అలరించింది. రంగస్థల నటుడు తుమ్మ బాల గంగాధర రావు, మల్లాది వెంకట కుటుంబ శర్మ పాల్గొని చిన్నారులను నృత్య కళా ప్రక్రియలలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. చిన్నారులను కళాకారులుగాతీర్చిదిద్దుతున్న రమేశ్‌ను వారు అభినందించారు.

తెలంగాణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాం

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో లైటింగ్ సిస్టం ప్రారంభించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ, జూన్ 9 : రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నట్లు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు రూ.2.23 కోట్ల తో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ(లైటింగ్ సిస్టం)ను సోమవారం రాత్రి సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ కుమార్ జైన్, హైదరాబాద్ రైల్వే డీఆర్ఎం లోకేశ్ విష్ణవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే హరీశ్‌తో కలిసి కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని టూరిజంగా అభివృద్ధి చేయడానికి అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రీతిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌కు ప్రసాద్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాచిగూడ, నల్లకుంట కార్పోరేటర్లు ఉమాయాదవ్, అమృత, గౌతమ్ రావు, దీపక్ రెడ్డి, రైల్వే సీనియర్ డీఈ కిరణ్ కుమార్, కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, ఏడిఆర్ఎం ముత్యాల నాయుడు, పీఆర్ఓ శైలేందర్ కుమార్, శ్రీనివాసులు తోపాటు రైల్వే వివిధ శాఖల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీని శాలువాతో సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం హైదరాబాద్ సిటీ బ్రాంచ్ యూనిట్ కార్యవర్గం

సుల్తాన్ బజార్, జూన్ 9 : విధినిర్వాహణతోపాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీ పిలుపునిచ్చారు. సోమవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు వరకల సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ నాలుగో తరగతి జాయింట్ డైరెక్టర్ పెన్షన్ పేమెంట్ ఆఫీస్ యూనిట్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా వరకల సత్యనారాయణ నేతృత్వంలో ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నూతన యూనిట్ కార్యవర్గాన్ని ప్రకటించారు. యూనిట్ అధ్యక్షుడిగా బి. నర్సింగ్, అసోసియేట్ అధ్యక్షుడిగా కే వెంకటేశ్ కుమార్, ఉపాధ్యక్షులుగా కే విజయ్ కుమార్, విజయలక్ష్మి, కార్యదర్శిగా కే ధనంజయ, సంయుక్త కార్యదర్శులుగా నమిత్ ఫాతియం, ఎం. శశికాంత్, కోశాధికారిగా సీ శశివర్ధన్ కార్యనిర్వాహణ కార్యదర్శిగా ఎన్. విజయకుమార్. ప్రచార కార్యదర్శిగా ఎం. విజయ రామారావు, ఆఫీస్ సెక్రటరీగా తౌఫిక్, కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వరి, సీ శాలిని, సమీనా బేగం తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీని కలిసి సన్మానించారు.

చాకుతో పొడిచిన దుండగులపై కేసు నమోదు

కాచిగూడ, జూన్ 9 : రైల్వే ట్రాక్ దాటుతుండగా వ్యక్తిపై గుర్తుతెలియని దుండగులు డబ్బులు డిమాండ్ చేసి, చాకుతో పొడిచి గాయపరిచిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. యాకత్ పుర ప్రాంతానికి చెందిన షేక్ హబీబ్ కుమారుడు షేక్ ఖదీర్(20) ఎల్క్ట్రీషియన్. ఆదివారం రాత్రి ఖదీర్ మలక్ పేటలో ఎంఎంటీఎస్ రైలు ఎక్కి యాకత్‌పుర రైల్వేస్టేషన్‌లో దిగాడు. అనంతరం ఇంటికి వెళ్లడానికి రైల్వే ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో గుర్తుతెలియని 6 గురు దుండగులు అతన్ని అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో ఖదీర్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో అతనిపై దుర్భాషలాడుతూ డబ్బులు ఇవ్వాలని చాకుతో ఛాతి, శరీరంపై దాడి చేశారు. దీంతో ఖదీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు అర్ధరాత్రి కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు 6 గురు దుండగులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫోన్ల దొంగ అరెస్ట్

కాచిగూడ, జూన్ 9 : జల్సాలకు అలవాటు పడి పలు రైళ్లల్లో ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న యువకున్ని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ లోని కామేశ్వరరావు కాలనీకి చెందిన మహమ్మద్ ఇబ్రహీం కుమారుడు మహమ్మద్ అహ్మద్ మోహినుద్దీన్ అలియాస్ దావూద్(27) సోఫా రిపేరర్. కొంత కాలంగా రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్లను ఎంచుకొని ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతూ దొంగలించిన ఫోన్లను అమ్ముతూ సొమ్ము చేసుకుంటాండు. వారం రోజుల క్రితం రైళ్లలో ఫోన్లు దొంగతనాలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం-1 లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి దావూద్‌ను ఆరా తీయగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. అతని నుంచి రెండు ఖరీదైన ఫోన్లను స్వాధీన పరుచుకుని,అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు రైల్వే సీఐ తెలిపారు.

'మట్టి పాటలో మనసు పరిమళం' పుస్తకావిష్కరణ

పుస్తకం ఆవిష్కరణలో పాల్గొన్న ఏనుగు నరసింహారెడ్డి, సాహితీవేత్తలు

తెలుగుయూనివర్సిటీ, జూన్ 9 : పల్లె ప్రజల జీవన విధానంలోని పాటలను తనదైన శైలిలో రచయిత్రి శీనమ్మ 'మట్టి పాటలో మనసు పరిమళం' పుస్తకంలో అద్భుతంగా రచించారని వక్తలు ప్రశంసించారు. రామదాసు సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి మోదెపల్లి శీనమ్మ రచించిన మట్టి పాటలో మనసు పరిమళం పుస్తకం ఆవిష్కరణ సభ భారత్ వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పోరెడ్డి రంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. పల్లెల దైన్యాన్ని పాటల రూపంలో రచయిత్రి శీనమ్మ గొప్పగా రచించారని ఆయన ప్రశంసించారు. కవి, గాయకుడు వాకిటి రామిరెడ్డికి గ్రంథాన్ని అంకితం చేశారు. సాహితీవేత్తలు డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి, కవి సాధనాల వెంకట స్వామినాయుడు, డాక్టర్ రాధా కుసుమ, కె.రమేశ్, టి. వెంకటకృష్ణ, బీమా శ్రీనివాసరావు, దూత రామకోటేశ్వరరావు, ఈడుపుగంటి పద్మ, ఎన్. నాగేశ్వర రావు, డాక్టర్ రవీంద్ర బాబు, జె.వి. కుమార్ పాల్గొని రచయిత్రి శీనమ్మ శైలిని ప్రశంసించారు.

ఐపీఈ-సిటీ కాలేజ్‌ల విద్యా సహకార ఒప్పందం

ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

చార్మినార్, జూన్ 9: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ)-ఓయూ క్యాంపస్‌తో సిటీ కాలేజ్ (అటానమస్) మధ్య విద్య సహకారం పై సోమవారం అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుని సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం మూడు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తెలిపారు. ఈ ఒప్పందం ఇరు సంస్థల మధ్య బోధన, పరిశోధన, విద్యార్థి కేంద్రక సహకారాన్ని మరింత పెంపొందించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందంపై ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసమూర్తి, ఐపీఈ పీజీడీఎం ప్రోగ్రామ్ హెడ్ ప్రొఫెసర్ (డా.) రామకృష్ణ యలమంచిలి, సిటీ కాలేజ్ వైస్-ప్రిన్సిపాల్ డా.పి.శాంతి, వాణిజ్య విభాగ అధిపతి డా. కె. మల్లికార్జునరావు, అధ్యాపకులు డా. ఎస్. ఝాన్సీ రాణి, శ్రీమతి ఇఫ్ఫత్ ఉన్నిసా సంతకాలు చేశారు. పాఠ్య ప్రణాళిక, పాఠ్యాంశాల రూపకల్పనలో సంయుక్తంగా పనిచేయడం, ఇరు సంస్థల అధ్యాపకులు, విద్యార్థులు ఉమ్మడి పరిశోధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా తక్షణ సహకారాన్ని బలోపేతం చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఒప్పందంలో భాగంగా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను నవీకరించడం, ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా పాఠ్యాంశాలను రూపొందించడానికి ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ, పారిశ్రామిక సందర్శన ఉంటుందని తెలిపారు.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల భర్తీకి అనుమతి హర్షణీయం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 9 : అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతిచ్చింది. 118 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని సంబంధిత డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు ఆదేశాలు జారీ చేయడంపై బార్ కౌన్సిల్ సభ్యులు జితేందర్‌రెడ్డి సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని గతంలో హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్ (11 ఆఫ్ 2025) పెండింగ్‌లో ఉన్నదన్నారు. ఈ అంశంపై ప్రస్తుత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్. సుజయ్‌పాల్ విచారణ చేపట్టారు. ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకుండా కాలయాపన చేసినప్పటికీ, మరోవైపు తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ద్వారా అనుమతి లభించడం తమ విజయంగా భావిస్తున్నామన్నారు. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రిట్ పిటిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం దిగొచ్చిందని, త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుందని సంతోషం వ్యక్తం చేశారు.

సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆరోగ్యమిత్ర కృషి

రవీంద్రభారతి, జూన్ 9 : ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే లక్ష్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఆరోగ్యమిత్ర కృషిచేస్తుందని ఆరోగ్యమిత్ర స్వచ